క్లుప్తంగా

వీరన్న సన్నిధిలో ఇంటెలిజెన్స్ ఎస్పీ పూజలు



కురవి : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో హైదరాబాద్ ఇంటెలిజెన్స్ ఎస్పీ శ్రీనివాస్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పశుగ్రాసం దగ్ధం



కురవి : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీలో తీసుకొస్తున్న పశుగ్రాసం విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైన సంఘటన మండలంలోని నేరడ శివారు ఎల్కచెట్టు తండా జీపీ పరిధిలోని మేగ్యా తండాలో శనివారం జరిగింది. మేగ్యా తండాకు చెందిన లూనావత్ సంజీవ పొలం నుంచి ట్రాక్టర్ ట్రాలీలో గడ్డిని తీసుకొస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న గడ్డికి పూర్తిగా కాలిపోయింది. డ్రైవర్ చాకచక్యంతో ట్రాలీ నుంచి ఇంజన్‌ను వేరుచేశాడు. ఈ ఘటనలో రూ.10వేలు నష్టం వాటిల్లింది.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్ : తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మానుకోట అనంతారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గండి ఉపేందర్ రావు శనివారం తెలిపారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నెహ్రూసెంటర్ : విద్యుత్ లైన్లపై ఉన్న చెట్లకొమ్మల తొలగింపు, పోల్స్ వేస్తున్నందున నేడు జిల్లా కేంద్రంలోని కొత్త బజారులో ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ నవ్యశ్రీ శనివారం తెలిపారు. కొండపల్లి గోపాల్‌నగర్‌కాలనీ, మూడుకోట్లు, కృష్ణకాలనీ, బ్యాంక్‌కాలనీ, ఇందిరాకాలనీ, ఫాతిమా హైస్కూల్, ఎన్జీఓస్ కాలనీ ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

తొర్రూరు పట్టణంలో..

తొర్రూరు : విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు (ఆదివారం) పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని డీఈ మధుసూదన్ తెలిపారు. 11 కేవీ ఫీడర్ మరమ్మతులతో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్



నెల్లికుదురు : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మండలంలోని మేచరాజుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ముంజంపల్లి అనూష పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో అనూష మృతిచెందింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును మృతురాలి భర్త రాజుకు.. శంకర్ నాయక్ శనివారం అందజేశారు. కొమ్మినేని సందీప్ పటేల్, కొయ్యడి వెంకన్న గౌడ్, రజనీకాంత్‌రావు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

- విద్యుత్‌శాఖ డైరెక్టర్ మధుసూదన్



నెహ్రూసెంటర్ : అకాల వర్షాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం, విద్యుత్ పోల్స్ నేలమట్టమైన ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ డైరెక్టర్ మధుసూదన్ సూచించారు. మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని జమాండ్లపల్లి, చంద్రుతండా, ముత్యాలమ్మ గూడెం, గాంధీపురం, గడ్డిగూడెం, బయ్యారం, రెడ్యాల, గుండ్రాతిమడుగు, కురవి, గార్ల, గొల్లచర్ల ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈదురుగాలుల వల్ల సుమారు 343 స్తంభాలు విరిగిపోయాయని దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఎస్ఈ జె.నరేష్, డీఈ విజయ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫలితాల్లో 'కస్తూర్బా' అదుర్స్

పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటిస్థానం

- చదువు మధ్యలో మానేసిన విద్యార్థినులకు అవకాశం
- కేజీబీవీతో బాలికలకు బంగారు భవిష్యత్



మానుకోటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

మహబూబాబాద్ అర్బన్ : బాలికలకు చదువు ఎంతో అవసరమని, చదువు మధ్యలో మానేసిన వారికి ప్రత్యేకంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత, సురక్షిత వాతావరణంలో బాధ్యతాయుతమైన చక్కని పౌరులుగా తీర్చిదిద్దే కేంద్రాలుగా కేజీబీవీలు విలసిల్లుతున్నాయి. బాలికల విద్యను మరింత పటిష్టం చేసేందుకు వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2011లో ప్రారంభించాయి.

ఆర్థిక స్థోమత లేని బాలికలకు వరం..

బాలికలకు ఆర్థిక స్థోమత లేక చదువు మధ్యలో మానేసిన, కొనసాగించలేని వారు, అనాథలకు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు వరంగా మారాయి. జిల్లాలో మొత్తం 15 కేజీబీవీలు, 7 కేజీబీవీ కళాశాలలున్నాయి. వీటిలో ప్రస్తుతం 3,315 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. చదువుతోపాటు నాణ్యమైన భోజనం, యూనిఫాం, పుస్తకాలు, వసతి వంటివి కల్పిస్తున్నారు. వృత్తి విద్యాకోర్సులతో పాటు కంప్యూటర్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్పోకెన్ ఇంగ్లిష్, కరాటే తదితర అంశాల్లో సైతం శిక్షణ ఇస్తున్నారు. బడి మధ్యలో మానేసిన బాలికలు కూడా రెగ్యులర్ విద్యార్థినులతోపాటు పోటీపడుతూ పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తూ క్రీడల్లో ముందుంటూ అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు.

బాలికలకు ప్రత్యేక సదుపాయాలు..

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆరోగ్య కిట్లు, వస్తువులు భద్రపర్చుకునేందుకు ట్రంక్ పెట్టెలు, ప్రతీ విద్యార్థినికి రూ.300 విలువైన నోట్‌బుక్స్, వసతి గృహంలో అవసరమైన సామాన్లు, పరీక్షల సమయంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పాఠశాలలకు వెళ్లేందుకు రెండు జతల యూనిఫాం, బ్లాంకెట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. చికెన్, మటన్, కోడిగుడ్లు అందిస్తుంది.

పది, ఇంటర్‌లో మెరుగైన ఉత్తీర్ణత..

పదో తరగతి ఫలితాల్లో చిన్నగూడురు కేజీబీవీ విద్యార్థిని దేవిప్రియ 600కు 567, మానుకోటలో సాయికీర్తన 560, పెద్దవంగరలో వర్షిణి 563, తొర్రూరులో అనూష 561, నర్సింహులపేటలో ధనలక్ష్మి 554, మరిపెడలో రిషిత 561, గార్లలో అంజలి 554, గంగారంలో కీర్తన 547, కురవిలో అంకిత 546, బయ్యారంలో ఉదయశ్రీ 538, డోర్నకల్‌లో సాయి 523 మార్కులు సాధించారు. జిల్లాలో అన్ని కేజీబీవీల్లో 100శాతం పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. మహబూబాబాద్, డోర్నకల్, గూడూరు, గార్ల, బయ్యారం కేజీబీవీల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 972, 944, 913, 916 మార్కులు సాధించారు. జిల్లా వ్యాప్తంగా 8 కేజీబీవీ కళాశాలలో మొత్తం 483 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 380 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న కేజీబీవీలో మొదటి స్థానం 99.80 శాతంగా నిలిచింది.

పట్టుదలతో చదివా..



పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలనే పట్టుదలతో చదివాను. 567 మార్కులు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాను. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. మా నాన్న కోరిక నెరవేరుస్తాను.

– దేవిప్రియ కేజీబీవీ, చిన్నగూడూరు

ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పది, ఇంటర్ విద్యార్థినులకు డీఈఓ స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ప్రత్యేకంగా 28 రోజులు పాటు 28 పరీక్షలు నిర్వహించి పరీక్షలంటే భయాన్ని పోగొట్టాం. కేజీబీవీలో చదివే ప్రతీ విద్యార్థి ఉన్నతంగా తీర్చిదిద్దే లక్ష్యంగా పది ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నాం.

– విజయకుమారి, జీసీడీఓ, మహబూబాబాద్

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



డీఈఓ, జీసీడీఓ ఆదేశాల మేరకు విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉదయం, సాయత్రం ప్రత్యేక తరగతులు, రోజువారిగా స్లిప్ టెస్ట్‌లు నిర్వహించాం. పదో తరగతి ఫలితాల్లో బయ్యారం కేజీబీవీలో 100 ఉత్తీర్ణత సాధించాము. ఉపాధ్యాయుల సహకారంతోనే ఈ విజయం సాధ్యం.

– నీలిమా, బయ్యారం కేజీబీవీ ఎస్ఓ

అంబేడ్కర్ ఆశయాలను సాధించాలి

తొర్రూరు రూరల్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధించేందుకు అందరూ ఏకం కావాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని అరిపిరాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైభీమ్, జై బాపు, జై సంవిధాన్ పేరుతో రాజ్యాంగ పరిరక్షణకై పాదయాత్రను చేపట్టారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌తో కలసి పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ముత్తినేని సోమేశ్వర్‌రావు, హమ్యా నాయక్, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, గంజి విజయపాల్‌రెడ్డి, నర్సయ్య, చెవిటి సధాకర్, మేరుగు మల్లేశంగౌడ్, రామచంద్రయ్య,సురేందర్ రెడ్డి,ప్రశాంతి, మల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



నైనాలలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నెల్లికుదురు : అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మతతత్వ బీజేపీ నుంచి రక్షించుకొని, పేదలకు రాజ్యాంగ ఫలాలను అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవ రెడ్డి, మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ తెలిపారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌లో భాగంగా మండలంలోని హనుమాన్ నగర్ తండా, నైనాల, పార్వతమ్మగూడెం గ్రామాల్లో శనివారం ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. నాయకులు సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, హెచ్.వెంకటేశ్వర్లు, బాలాజీ నాయక్, సతీష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ



కేసముద్రం : మండలంలోని పెనుగొండ శివారు కట్టుగూడెనికి చెందిన దారం వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుమారుడైన ములుగు సీఐ దారం సురేష్‌ను, బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి సీతక్క పరామర్శించారు. అనంతరం వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కురవి : రాజోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బస్వ వీరేష్ తండ్రి జగన్నాథం శనివారం మృతిచెందాడు. కాగా డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

'పది' ప్రతిభావంతులకు సన్మానం



చిన్నగూడూరు: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం ఉషశ్రీ, ఉపాధ్యాయులు



మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కురవి: ఉపాధ్యాయులతో విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. నక్క విష్ణువర్ధన్ 540 మార్కులు, లావుడ్యా గౌతమి 525, ఇస్లావత్ ప్రియాంక 514, నూకల యశ్వంత్ 501 మార్కులు సాధించారు. ప్రధానోపాధ్యాయుడు, గ్రామస్తులు ఉపాధ్యాయులు శనివారం విద్యార్థులను సత్కరించారు. మాజీ ఎంపీటీసీ మద్ది వెంకటరెడ్డి విద్యార్థులను నగదు బహుమతితో సత్కరించారు. అంజయ్య, రాంరెడ్డి, తిరుపతయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులతోనే ప్రభుత్వ ఉద్యోగాలు

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులు ఉన్నత చదువులతోనే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో మంచి ఉద్యోగాలు సాధించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మారపు గణేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 10మంది విద్యార్థుల తల్లిదండ్రులను శనివారం ఉపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్ సన్మానించారు.

మెమోంటోల అందజేత

చిన్నగూడూరు : మండలంలోని జయ్యారం పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషశ్రీ విద్యార్థులకు మెమోంటోలు, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం తేజోన్నత రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండి

కురవి : ప్రతీ ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం.సత్యనారాయణ కోరారు. పాఠశాలలో పదో తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనపరిచిన ప్రతిభావంతులకు ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సత్కరించారు. వేదవ్యాస్(563), కల్యాణి (559), మాధురి(555) లతోపాటు మరికొందరు ఉత్తమ మార్కులు సాధించారు. మల్లయ్య, సలీమ్, విష్ణు, రమేష్, వెంకన్న, సునీల్, కావ్య, వీరేందర్ పాల్గొన్నారు.

విలేకరుల ముసుగులో 'డబుల్' దందా



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

చిన్నగూడూరు : అధికార పార్టీ పేరుతో కొంతమంది విలేకరుల ముసుగులో 'డబుల్' దందా చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తే సహించేది లేదని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సూదగాని నగేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తెం రమేష్‌లు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో పార్టీ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల అవినీతిపై న్యాయ విచారణ చేయాలన్నారు. ఇళ్లు ఇప్పిస్తామని కొంతమంది విలేకరుల ముసుగులో భారీగా వసూళ్లకు పాల్పడినట్లు మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూడా ఇళ్లు ఇప్పిస్తామని డబ్బులు వసూళ్లు చేసి అమాయక ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. నాయకులు భిక్షపతి, నిరంజన్, జహంగీర్, రఫీ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

5న పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్ : టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ప్రవేశ పరీక్ష జిల్లా కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్ శనివారం తెలిపారు.

సువర్ణలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన

కేసముద్రం : మున్సిపల్ పరిధిలోని జమలాపురంలో సువర్ణలక్ష్మి (సవర్ లచ్చమ్మ) విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా నాయకుడు వోలం శ్రీనివాస్‌లు పూజలు నిర్వహించారు.

వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంతి

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని శ్రీపార్వతి రామలింగేశ్వర శివాలయంలో ఆదిశంకరాచార్యుల జయంతి పూజలను శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు సుధాకరశాస్త్రి, సునీత దంపతుల ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్యుల విగ్రహరూపానికి పాలాభిషేకం చేశారు.

ఘనంగా కంఠమహేశ్వరస్వామి పండుగ

తొర్రూరు రూరల్ : మండలంలోని అమ్మాపురంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంఠమహేశ్వరస్వామి పండుగ వేడుకలను శనివారం ప్రారంభించారు. గౌడకులస్తులు ఉదయం జలబిందెలతో డప్పుచప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ దేవాలయానికి చేరుకొని కంఠమహేశ్వరస్వామి, సురమాంబ, ఎల్లమ్మ విగ్రహాలను శుద్ధి చేసి, ప్రత్యేక పూజలు చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

గూడూరు : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 8నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్ రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేశ్ తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో శనివారం ఆలయ కమిటీ, గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

కురవి హైస్కూల్‌లో చోరీ

కురవి : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు హెచ్ఎం ఎండీ వాహిద్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 1వ తేదీన పాఠశాల గదిలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి అందులోని బీరువాను ధ్వంసం చేసి రూ.5వేల విలువైన క్రీడా సామగ్రిని అపహరించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

డోర్నకల్ : డోర్నకల్ మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. స్థానిక పెద్దచెరువులో రూ.4.8 లక్షల సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిధులతో చేపడుతున్న బోరుబావుల ఏర్పాటుకు కమిషనర్ శంకుస్థాపన చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ : ఈనెల 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

పెద్దవంగర : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా యువత కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. శనివారం మండలంలోని గంట్లకుంట, కాన్వాయి గూడెం, రామోజీ తండాలో యూత్ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంఘటితంతో హక్కులు సాధించాలి

కురవి : సంఘటితంతోనే కార్మికులు తమ హక్కులను సాధించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తట్టుపల్లిలో మేడే ఉత్సవాల్లో భాగంగా శనివారం దొంతు రామ్మూర్తి అరుణ పతాకాన్ని ఎగురవేశారు.

'కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి'

తొర్రూరు : బీఆర్ఎస్ హయాంలో తొర్రూరు పట్టణ అభివృద్ధి అనేది అవాస్తవమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనే తొర్రూరులో అభివృద్ధి జరిగిందన్నారు.

జ్ఞానేశ్వర్‌ను కలిసిన నాయకులు

పెద్దవంగర : రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్, పాలకుర్తి నియోజకవర్గ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ బొర్ర జ్ఞానేశ్వర్‌ను ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పూర్ణచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

రేపటినుంచి రెవెన్యూ సదస్సులు

దంతాలపల్లి : మండల వ్యాప్తంగా సోమవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సునీల్ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంలో భాగంగా గ్రామాల్లో 5నుంచి 10వ తేదీ వరకు సదస్సులు నిర్వహించి రైతులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

హైవేపై వంతెన నిర్మించాలి

కురవి : మండలంలోని మోద్గులగూడెం శివారు బేగావత్ తండా గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ హైవేపై వంతెన నిర్మించాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు. తండావాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం రెండో రోజుకు చేరాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

కురవి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కురవి పీఎస్సై కృష్ణారెడ్డి శనివారం తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన డెంకని శ్రీనివాస్ తన అల్లుడు, కుమార్తె అనంతుల ఉపేందర్–జ్యోతి ఇంటివద్ద ఉన్న తన భార్య కళమ్మను తీసుకొచ్చేందుకు శుక్రవారం రాత్రి బైక్‌పై బయల్దేరాడు. ఈక్రమంలో గ్రామ శివారులోని రైతువేదిక మూలమలుపులో శ్రీనివాస్ ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో అటుగా వెళ్తున్న వారు గమనించి శ్రీనివాస్ అల్లుడు ఉపేందర్‌కు సమాచారం అందించారు. తీవ్రగాయాలతో ఉన్న శ్రీనివాస్‌ను 108లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ శనివారం శ్రీనివాస్ మృతి చెందాడు. భార్య కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

ప్రజా ప్రభుత్వంలో ప్రయాణ కష్టాలు తీరాయి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తొర్రూరు ఆర్టీసీ బస్టాండులో ఏసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు : ప్రజా ప్రభుత్వంలో మహిళలు, సామాన్యులకు ప్రయాణ కష్టాలు తీరాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు డిపోనకు కేటాయించిన రెండు రాజధాని ఏసీ బస్సులను శనివారం ఆర్టీసీ బస్టాండులో అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ బస్సులు తొర్రూరు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం కొనసాగించనున్నాయి. కొత్త బస్సులో ఎమ్మెల్యే టికెట్ తీసుకుని కొద్దిదూరం ప్రయాణించారు. డీఎం పద్మావతితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ సంస్థ కొత్త బస్సులను అందుబాటులోకి తెచ్చిందని, ఇప్పటికే ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ విజయవంతంగా నడుపుతోందన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తోందని, ఆ చార్జీల మొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు ముత్తినేని సోమేశ్వరరావు, జాటోత్ హామ్యా నాయక్, సుంచు సంతోష్, మంగళపల్లి రామచంద్రయ్య, సోమ రాజశేఖర్, సురేందర్‌రెడ్డి, పెదగాని సోమయ్య, ధరావత్ సోమన్న, తూనం శ్రావణ్‌లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పేర్కొన్నారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న మాదక ద్రవ్యాలు, గుట్కా వ్యతిరేక పోస్టర్లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మురళీనాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, ఇది ఒక సామాజిక సమస్యగా దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు శంతన్ రామరాజు, వేముల వెంకన్న, ఆడెపు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, భగవాన్ రెడ్డి, సుధీర్, శ్యామ్, రంగారెడ్డి తదితరులు పాల్గొనారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



బయ్యారం: పంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు



తొర్రూరులో ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న కంఠాయపాలెం గ్రామస్తులు

తొర్రూరు : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కంఠాయపాలెం గ్రామస్తులు కోరారు. మండలంలోని కంఠాయపాలెంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక సక్రమంగా లేదని పేర్కొంటూ శనివారం డివిజన్ కేంద్రంలో ఆర్డీఓ గణేష్, ఎంపీడీఓ పూర్ణచందర్‌రెడ్డికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఆస్తులు, ఇళ్లు ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేశారని, ఎంపిక పారదర్శకంగా లేదని పేర్కొన్నారు. అర్హులకే ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, ఎంపిక జాబితా గ్రామ పంచాయతీ ఎదుట ప్రదర్శిస్తామని ఆర్డీఓ హామీచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎండీ యాకూబ్, నాయకులు సర్వయ్య, మార్క సాంబయ్య, యర్రం రాజు, గోసంగి భాస్కర్, నిమ్మల ఐలయ్య, సందీప్ పాల్గొన్నారు.

అనర్హులను ఎంపిక చేశారని ధర్నా

గార్ల : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పంచాయతీ కార్యదర్శి అనర్హులను ఎంపిక చేశారంటూ శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కోట్యానాయక్ తండావాసులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి ఇళ్లు ఉన్నవారు, భూమి ఉన్నవారిని ఎంపిక చేసి, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అనర్హులకు చోటు కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లి కాని వారికి సైతం అర్హుడుగా చేర్చాడని వారు ఆరోపించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ మంగమ్మకు అందజేశారు. ఇదే విషయంపై ఎంపీడీఓను సాక్షి వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శిని మళ్లీ సర్వే చేసి రెండు రోజుల్లో అర్హులను గుర్తించి సర్వే జాబితాను అందజేయాలని ఆదేశించినట్లు ఆమె పేర్కొన్నారు.

బయ్యారం : అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలని మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు బండారి ఐలయ్య, మాధంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ఇళ్లు మంజూరు చేయడం తగదన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, సర్వయ్య, జయరాజు, రమేష్, యాకయ్య, శ్రీను, సురేష్, కృష్ణ, నిరంజన్, వెంకయ్య, తిరుపయ్య పాల్గొన్నారు.